కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -232 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 02-09-2026 బుధవారం పేజీలు : 4

# ఖర్గేకు అవమానం.. బీజేపీపై ఉత్తమ్ ఫైర్

బీజేపీ కులవివక్షకు ఇదే నిదర్శనం!

'అంటరానితనానికి మరో రూపం'

రాహుల్‌పై ఎఫ్ఐఆర్.. ఉత్తమ్ ఆగ్రహం

బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు బట్టబయలు!

ప్రశ్నించిన రాహుల్‌పైనే కేసా?

దళితుల ఆత్మగౌరవంపై దాడి!



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బిఎన్ఎస్ న్యూస్):** ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీ రామ్ లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభ అనంతరం.. ఆయన ప్రసంగించిన వేదికపై శుద్ధీకరణ నిర్వహించడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. కులవివక్షతో చేసిన ఈ పని అత్యంత అవమానకరమైనదన్నారు.

2 లో

# కాంగ్రెస్‌పై బీజేపీ 'చార్జిషీట్'

హామీలన్నీ గాలికేనా?

ప్రతి మహిళకు రూ.83 వేల బాకీ!

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఫైర్

మూసీ పేరుతో అవినీతి దందా?

ఫ్యూచర్ సిటీ.. రియల్ ఎస్టేట్ దందా?

తెలంగాణ ఆర్థిక పరిస్థితి రెడ్ అలర్ట్!



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బిఎన్ఎస్ న్యూస్):** వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో వెయ్యి అబద్ధాలు, వెయ్యి మోసాలతో సాగిందని తెలంగాణ బీజేపీ విమర్శించింది. కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై ఇవాళ నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి బీజేఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ వెయ్యి రోజుల్లో అంతా అస్తవ్యస్తంగా అయిందని అంతా కుంభకోణాలు, లా అండ్ ఆర్డర్ వైఫల్యమే ఉందన్నారు. ఎక్కడ చూసినా కుంభకోణాలు, అవినీతి పాలన తప్ప మరొకటి కనబడటం లేదన్నారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ

2 లో

# సురేఖపై హైకమాండ్ ఫోకస్



- కేసీ వేణుగోపాల్‌తో కీలక భేటీ
- ఖర్గే అపాయింట్‌మెంట్‌కు ప్రయత్నాలు
- సుస్మిత వ్యాఖ్యలపై దుమారం
- సురేఖకు టీపీసీసీ షోకాజ్
- క్రమశిక్షణ కమిటీకి వివరణ
- హైకమాండ్ నిర్ణయంపై ఉత్కంఠ
- మంత్రి పదవిపై ఊహాగానాలు
- ఢిల్లీలో కాంగ్రెస్ కీలక మంతనాలు

**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బిఎన్ఎస్ న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖకు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది.

మిగతాది 2 లో..

# బీజేపీ చీఫ్ అరెస్ట్.. కాంగ్రెస్‌పై ఫైర్!



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బిఎన్ఎస్ న్యూస్):** నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ ఇంటిపై సోమవారం దాడి జరిగిన విషయం తెలిసిందే. దీనిపై బీజేపీ కౌంటర్ అటాక్ కు సిద్ధమయింది.

2 లో

# మళ్లీ వెలుగులోకి లేడీ అఘోరీ!



2 లో

చితి వద్ద షాకింగ్ వీడియో!

కాలుతున్న చితి నుంచి శరీర భాగాలు?

లేడీ అఘోరీ సంచలన వ్యాఖ్యలు

నార్త్‌లోనూ అదే తంతు!

'మనిషినే తింటా'.. షాకింగ్ కామెంట్స్

సోషల్ మీడియాలో వైరల్‌గా వీడియో

మళ్లీ అరెస్ట్ చేయాలంటున్న నెటిజన్లు

# స్థానిక పోరుకు ఏపీ రెడీ!

తుది పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల


13,278 పంచాయతీలు..

1.36 లక్షల పోలింగ్ కేంద్రాలు

1,33,128 వార్డులకు పోలింగ్ స్టేషన్లు

అభ్యంతరాల పరిశీలన తర్వాత తుది జాబితా

కలెక్టర్ల అనుమతితో జాబితా ఖరారు



A.P. STATE ELECTION COMMISSION
1st Floor, New HODs Building, Vijayawada – 520 010.

PRESS NOTE

The State Election Commission has issued a Circular on 12.08.2026 notifying the schedule for preparation and publication of List of Polling Stations in Gram Panchayats for the purpose of conducting 2nd Ordinary Elections.

As per the schedule, the draft lists of Polling Stations have been published by the Mandal Parishad Development Officers concerned on 23.08.2026 and the claims and objections have been received till 26.08.2026. After taking into consideration all the claims and objections, the final List of Polling Stations have been published with the approval of the Collectors & District Election Authorities concerned on 31.08.2026.

As per the reports received from the Districts, 1,36,326 Polling Stations have been proposed in 1,33,128 Wards of 13,278 Gram Panchayats in the State.

Date: 01.09.2026

Sd/- Anil Chandra Punetha
State Election Commissioner
Andhra Pradesh

//Attested//
Joint Director



2 లో

**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బిఎన్ఎస్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. గ్రామపంచాయతీల ఎన్నికలకు సంబంధించిన తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారుల అనుమతితో అన్ని ప్రక్రియలను పూర్తి చేసి ఈ జాబితాను వెల్లడించినట్లు ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ గత నెల 12న గ్రామపంచాయతీల పోలింగ్ స్టేషన్ల ప్రచురణకు సంబంధించి సర్క్యులర్ జారీ చేసింది. అనంతరం గత నెల 23న పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ జాబితాను ప్రచురించారు. దీనిపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు గత నెల 26 వరకు అవకాశం కల్పించారు. అందిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం తుది జాబితాను సిద్ధం చేశారు.

# ఏపీలో లవ్ జిహాద్

ఆరుగురు మహిళలతో సహజీవనం?

ప్రేమ పేరుతో పెళ్లి.. ఆపై మతమార్పిడి

పెళ్లైన రెండు నెలలకే వేధింపులు

మరో ఐదుగురు మహిళలకూ ఇదే ట్రాప్?

ఇష్టానికి విరుద్ధంగా పేరు మార్చారంటూ ఫిర్యాదు

నిందితుడిపై యువతి సంచలన ఆరోపణలు

ఓ మహిళ ఫిర్యాదుతో నిందితుడికి రిమాండ్

యువతి ఫిర్యాదుపై పోలీసుల దర్యాప్తు

2 లో

# ఏసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ!

త్వరలో భారీగా ఏసీ బస్సుల రాక

సంక్షేమమే కాదు.. అభివృద్ధీ మా విధానమే

రెండేళ్లలో సంక్షేమానికి రూ.1.50 లక్షల కోట్లు


పెన్షన్ల రూపంలో ఇప్పటివరకు రూ.73 వేల కోట్లు

మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు 350 కేసులు

ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి ఆగదు

2 లో

# కల్యాణలక్ష్మికి గ్రీన్ సిగ్నల్!





2 లో

స్టేతో ఆగిన పథకాలకు హైకోర్టు బ్రేక్ రిలీజ్

డివిజన్ బెంచ్ తీర్పుతో వేల కుటుంబాలకు ఊరట

స్టే ఎందుకు? కాగ్ నివేదికపై కోర్టు ప్రశ్న

ప్రభుత్వ వాదనలకు హైకోర్టులో కీలక ప్రాధాన్యం

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై క్లియర్ అయిన దారి

# జీడీపీ జోరు.. మోదీ హర్షం!

భారత్ జీడీపీ దూకుడు.. 7.8% వృద్ధి!

ప్రపంచ సంక్షోభాల్లోనూ భారత్ జోరు!

ప్రజల శ్రమకు ప్రతిఫలం: ప్రధాని

'వోకల్ ఫర్ లోకల్'కు పిలుపు

స్వదేశీ వస్తువులకే ప్రాధాన్యం ఇవ్వాలి

'వెడ్ ఇన్ ఇండియా'కు మోదీ పిలుపు

వాస్తవ జీడీపీ రూ.81.36 లక్షల కోట్లు

ఆర్‌బీఐ అంచనాల కంటే మెరుగైన వృద్ధి

వికసిత్ భారత్ లక్ష్యంగా దూకుడు!





**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బిఎన్ఎస్ న్యూస్):** భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి బలమైన వృద్ధిని నమోదు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) దేశ వాస్తవ జీడీపీ 7.8% వృద్ధి చెందింది. ఈ వృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారత ప్రజల సమష్టి శక్తికి, కష్టపడి పనిచేసే తత్వానికి ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు.

పీఎం మోదీ తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ భారత్ వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక స్థిరత్వం దెబ్బతిన్నప్పటికీ భారత్ తన పురోగతిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

దేశంలో కొందరు నిరాశావాదంతో తప్పుడు ప్రచారం చేస్తూ..

2 లో

# నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లు రద్దు!

నీట్ నిరసనకారులకు సుప్రీం భారీ ఊరట

జూలై 20-25 నిరసనలపై కేసులు ఉండవు

2,873 మందికి మాత్రం కేసుల ముప్పు

నేరచరిత్ర ఉన్నవారికి సుప్రీం షాక్

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం

సెప్టెంబర్ 5 నిరసన మార్చ్‌ను రద్దు చేసిన సీజేపీ

ఆర్టికల్ 142 కింద ఎఫ్ఐఆర్‌ల రద్దు

2 లో

# కల్యాణలక్ష్మికి గ్రీన్ సిగ్నల్!

**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బీఎన్ఎస్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అమలుపై హైకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ పథకాల అమలుపై సింగిల్ బెంచ్ గతంలో విధించిన మధ్యంతర స్టేను హైకోర్టు డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. అయితే ఈ పథకాల అమలుకు సంబంధించిన కొన్ని జీవోలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సింగిల్ బెంచ్ మధ్యంతర స్టే విధించింది. దీంతో పథకాల అమలుపై అనిశ్చితి నెలకొంది. అయితే సింగిల్ బెంచ్ స్టేను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. పేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు సామాజిక, ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతున్నాయని కోర్టుకు వివరించారు.

సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా వేలాది మంది పేద లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పథకాల చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన ప్రధాన పిటిషన్‌కు ప్రజా ప్రయోజనం లేదని, దాన్ని కొట్టివేయాలని కోర్టును కోరారు. దీనితో విచారణ సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై కాగ్ నివేదికలో అసలు అభ్యంతరం వ్యక్తం చేశారా..? అనే అంశంపైనా ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. కాగ్ నివేదికలో ఈ పథకాలకు సంబంధించిన అంశం లేకపోతే వాటి అమలును ఎందుకు నిలిపివేయాలని కోర్టు ప్రశ్నించింది.

# సురేఖపై హైకమాండ్ ఫోకస్

**మొదటి పేజీ తరువాయి**

గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలె గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది.

కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది.

ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

అవన్నీ చెప్తే నాకు నోటీసులు వస్తాయ్.. కొండా సురేఖ వివాదంపై మల్లు రవి వ్యాఖ్యలు

కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా 2 రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.

మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా 2 రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది.

సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# మళ్లీ వెలుగులోకి లేడీ అఘోరీ!



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బీఎన్ఎస్ న్యూస్):** అప్పట్లో తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన లేడీ అఘోరీ అలియాస్ శ్రీనివాస్ జైలు జీవితం తరవాత కనిపించకుండా పోయిన సంగతి తెలిసిందే. అయితే జైలు జీవితం తరవాత అతడు మారిపోతాడని అంతా అనుకున్నారు. కానీ మారకపోగా ఇప్పుడు ఉత్తరాధి రాష్ట్రాలకు మకాం మార్చాడు. నార్త్ లో తిరుగుతూ ఇప్పటికీ అలాంటి వీడియోలే చేస్తున్నాడు. తాజాగా లేడీ అఘోరీ స్మశానంలో చేసిన సోషల్ మీడియాలో చేసిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. వీడియోలో కాలుతున్న చితి నుండి మానవ శరీర భాగాలు తీసుకుని తినేసింది.

వేడి వేడిగా ఉందని, చాలా రుచిగా ఉందని మీరు చనిపోయినా ఇలాగే తింటానని చెప్పింది. పెద్ద పెద్ద మంత్రగాళ్లనే తాను ఎదురించానని, తనతో జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. తాను కడుపు నింపుకోవడం కోసం, తన ఆకలి తీరడం కోసం మనిషిని తింటానని చెప్పింది. మనిషినే తింటే తానేంటో అర్థం చేసుకోవాలని హెచ్చరించింది. స్మశానంలో గడపడం, భూతప్రేతాలతో ఆడుకోవడమే తన పని చెప్పింది. కొద్దిగా మానవ శరీరాన్ని తినగానే తన కడుపు నిండిపోతుందని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో నెటిజన్లు అతడిని పట్టుకుని మరోసారి జైల్లో వేయాలని కోరుతున్నారు.

# స్థానిక పోరుకు ఏపీ రెడీ!

**మొదటి పేజీ తరువాయి**

తాజా జాబితా ప్రకారం.. రాష్ట్రంలోని 13,278 గ్రామపంచాయతీల పరిధిలోని 1,33,128 వార్డులకు మొత్తం 1,36,326 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. స్థానిక ఎన్నికల్లో గ్రామపంచాయతీలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా ఈ జాబితాను ఖరారు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు అందించిన అనుమతులు, సూచనల ఆధారంగా తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. డ్రాఫ్ట్ జాబితా తర్వాత వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ప్రక్రియను పూర్తి చేసినట్లు పేర్కొంది.

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల తుది జాబితా ప్రచురణతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన కీలక ప్రక్రియలో మరో దశ పూర్తయింది. ఇక తదుపరి ఎన్నికల ఏర్పాట్లు, ఇతర షెడ్యూల్‌కు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉంది.

# కాంగ్రెస్‌పై బీజేపీ 'చార్జిషీట్'

ఇచ్చిన హామీలు నెరవేర్చలేక అబద్ధాలతో ప్రజలను గోసపుట్టిస్తోందన్నారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు.

**ప్రతి మహిళకు రూ. 83 వేలు బాకీ:**

మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల మహిళలకు రూ. 2500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం అమలు చేసి ఉంటే ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రతి మహిళా ఖాతాలో రూ.83 వేలు పడేవి కదా అని నిలదీశారు. ఫించన్లు, ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో విద్యార్థులు తమ తల్లిదండ్రుల బంగారం అమ్ముకుని సర్టిఫికెట్లు తెచ్చుకునే పరిస్థితి వచ్చిందన్నారు. బిహార్ వంటి రాష్ట్రం విద్యాశాఖకు తమ బడ్జెట్ లో 10 శాతం కేటాయిస్తే తెలంగాణలో మాత్రం కేవలం 8 శాతమే కేటాయించారని విమర్శించారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ సమాధానం చెప్పాలన్నారు. విద్యా భరోసా కార్డులు ఏమయ్యాయని నిలదీశారు.

**ఉన్న సిటీని పట్టించుకోరు కానీ..**

22-ఏ పై పేరుతో పెద్ద ఎత్తున ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని ఈ అంశంపై సెప్టెంబర్ 5,6 తేదీలలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలమంతా దీక్ష చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రైతులు, ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. ఓ వైపు ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకే డబ్బులు లేవని చెబుతున్న ప్రభుత్వం మరో వైపు రాత్రికి రాత్రి తమ ఆస్థాన గుత్తేదారుల జేబులు నింపేందుకు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఉన్న సిటీని పట్టించుకోని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందాకు తెర తీసిందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రెడ్ అలర్ట్ తో ఉందన్నారు.

# ఖర్గేకు అవమానం.. బీజేపీపై ఉత్తమ్ ఫైర్!


**మొదటి పేజీ తరువాయి**

ఈ ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై ఉత్తరాఖండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరిణామాలు బీజేపీ ద్వంద్వ ప్రమాణాలను బహిర్గతం చేశాయని అన్నారు. శుద్ధీకరణ కార్యక్రమంపై తమను ఎవరూ ప్రశ్నించకుండా ఉండేందుకు.. రాహుల్ గాంధీపై కేసుపెట్టారని వాపోయారు.

ఆగస్టు 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించిన "విజయ్ శంఖనాద్" బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపైనే ఆయన ప్రసంగం సాగింది. మల్లికార్జున ఖర్గే ఏ మతాన్నిగానీ, ఏ వర్గాన్నిగానీ ప్రస్తావించలేదు, ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడలేదు. బహిరంగ సభ జరిగిన రెండు రోజుల తర్వాత, ఆగస్టు 10న, శ్రీరామ్ సేన ధార్మిక సేవా న్యాస్‌కు చెందిన సభ్యులు ఖర్గే ప్రసంగించిన అదే వేదికపై కథిత 'శుద్ధీకరణ' హవనం నిర్వహించారు. ఆగస్టు 13న రాజ్యసభలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఖర్గే.. ఒకరకమైన అంటరానితనం అనే భావాన్ని ఎదుర్కొన్నారన్నారు. "ఇది కేవలం కాంగ్రెస్ అధ్యక్షుడికి జరిగిన వ్యక్తిగత అవమానం కాదు. తరతరాలుగా వివక్ష, సామాజిక వెలివేత, అవమానాలను ఎదుర్కొంటున్న కోట్లాది మంది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడి," అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో ఈ ఘటన జరగడం మరింత సిగ్గుచేటని ఆయన అన్నారు.

ఈ ఘటనపై రాహుల్ గాంధీ తీసుకున్న ధైర్యవంతమైన, నిస్సందేహమైన వైఖరిని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభినందించారు. ఆగస్టు 29న న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఇటువంటి 'శుద్ధీకరణ' అంటరానితనానికి మరో రూపమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బాధ్యులైన వారిపై షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై దౌర్జన్యాల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కానీ.. ఆ శుద్ధీకరణ నిర్వహించిన సంస్థకు చెందిన సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాహుల్ పైనే ఉత్తరాఖండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగ హక్కులను కాపాడుతూ ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి, ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దర్యాప్తు సంస్థలను ఎలా ఉపయోగిస్తున్నారో ఈ ఎఫ్ఐఆర్ స్పష్టం చేస్తోందని మంత్రి అన్నారు.


# ఏసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ!



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బీఎన్ఎస్ న్యూస్):** కేంద్రం సహకారంతోనే పరిపాలనలో దూసుకుపోతున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. మొగల్తూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ... అభివృద్ధితో పాటు సంక్షేమం ముఖ్యం అన్నదే తమ విధానం అని చెప్పారు. ప్రజల కోసమే కూటమి పార్టీలు ఒక్కటయ్యాయని చెప్పారు. ప్రజలకు సంక్షేమపాలన అందిస్తామని హామీ ఇచ్చామని, గత ఎన్నికల్లో ప్రజలు ఏక పక్షంగా తమకు విజయాన్ని అందించారని అన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకే పేదలకు సేవలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. రెండేళ్లలో రూ.1.50 కోట్లు సంక్షేమం కోసం ఖర్చు చేశామని తెలిపారు.

మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు చేశారని ఆరోపించారు. డీఎస్సీని అడ్డుకునేందుకు 350 కేసులు వేశారని వ్యాఖ్యానించారు. ఎన్ని కుట్రలు చేసినా తన ప్రయత్నాన్ని అడ్డుకోలేరని మండిపడ్డారు. ఆడబిడ్డలు కష్టపడొద్దని దీపం పథకం పెట్టి గ్యాస్ సిలిండర్లు ఇచ్చామన్నారు. ఇప్పుడు ప్రతి రంగంలోనూ పురుషులతో సహా మహిళలు పోటీ పడుతున్నారని చెప్పారు. ప్రజలకు ఇప్పటి వరకు పెన్షన్ల రూపంలో రూ.73వేల కోట్లు ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున ఏసీ బస్సులు రాబోతున్నాయని చెప్పారు. వాటిలోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధిని అడ్డుకోలేదని వ్యాఖ్యానించారు.

# 22 మంది ప్రాణాలు బలిగొన్న కేసు..
# యజమాని సహా ముగ్గురిపై చార్జ్‌షీట్




**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బీఎన్ఎస్ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలోని మాల్వియా నగర్ హోటల్‌లో చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదం కేసులో ఢిల్లీ పోలీసులు విచారణలో కీలక ముందడుగు వేశారు. 22 మంది ప్రాణాలు బలిగొన్న హృదయ విదారక ఘటనపై దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు సాకేత్ కోర్టులో ఇవాళ మధ్యాహ్నం చార్జ్‌షీట్‌ను సమర్పించారు. ఈ మేరకు హోటల్ యజమాని లవ్‌కేష్ బజాజ్ తో పాటు మరో ఇద్దరిని ప్రధాన నిందితులుగా పోలీసులు తమ చార్జ్‌షీట్ ప్రధానంగా పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, నిర్లక్ష్యం వహించడం వంటి అంశాలపై వీరిపై ఆరోపణలు నమోదు చేశారు.

22 మంది సజీవదహనం..

కాగా, జూన్ 3న మాల్వియా నగర్ ప్రాంతంలోని సదరు హోటల్‌లో అకస్మాత్తుగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనంలో చిక్కుకున్న వారు బయటకు రాలేకపోయారు. ఈ దుర్ఘటనలో 13 మంది విదేశీ పర్యాటకులతో కలిపి మొత్తం 22 మంది దారుణంగా ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తాజాగా దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను సాకేత్ న్యాయస్థానం పరిశీలనకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ సెప్టెంబర్ 3న జరగనుంది.

# బీజేపీ చీఫ్ అరెస్ట్.. కాంగ్రెస్‌పై ఫైర్!

అయినప్పటికీ ఆయన నల్గొండ వెళ్లేందుకు ప్రయత్నించడంతో.. పోలీసులు అడ్డుకుని తమ వాహనంలో ఎక్కించారు. ఈ క్రమంలో పోలీసులు, ప్రభుత్వం తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం అనేది ఉందా అని ప్రశ్నించారు. పరామర్శకు వెళ్తుంటే అక్రమ అరెస్టులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పతనానికి దగ్గర్లో ఉందన్నారు.



1000 రోజుల పాలనలో ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ సర్కార్.. ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుని ఇలా అరెస్టులు చేయడం తగదన్నారు. వర్షిత్ పై, అతని కుటుంబంపై కాంగ్రెస్ నేతలు దాడులు చేయడం తగదన్నారు. అటు నల్గొండలో, ఇటు హైదరాబాద్ లో కాంగ్రెస్ - బీజేపీల మధ్య పరస్పర దాడులు జరుగుతున్నాయి. బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు.

# ఎఫ్ఐఆర్‌లు కొట్టివేసిన సుప్రీం!



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బీఎన్ఎస్ న్యూస్):** నీట్ నిరసనకారులకు భారీ ఊరట లభించింది. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను దేశ సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. దీంతో విద్యార్థులకు ఉపశమనం లభించింది. కానీ నేర చరిత్ర ఉన్న వారికి మాత్రం షాకిచ్చింది. వారిపై మాత్రం కేసులు కొనసాగుతాయని సుప్రీం కోర్టు తెలిపింది.

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్‌కు నిజాయితీగా నిరసన తెలిపేందుకు వచ్చిన యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్టికల్ 142 కింద కేసులు రద్దు చేసినట్లు న్యాయస్థానం తెలిపింది. జూలై 20 నుంచి 25 మధ్య జరిగిన నిరసనల్లో నమోదైన ఎఫ్ఐఆర్లు అన్నింటినీ రద్దు చేసింది. జూలై 20 నుంచి 25 మధ్య జరిగిన సీజేపీ నిరసనలపై దేశంలో ఎక్కడా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయొద్దని ఆదేశించింది. 2,873 నేరచరిత్ర కలిగిన వారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు స్వేచ్ఛనిచ్చింది. ఇక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నష్టపరిహారం చెల్లింపులపై విధివిధానాలు రూపొందించాలని సూచించింది. విధివిధానాలు రూపొందించిన మూడు నెలల్లోగా కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహనకు కట్టుబడి ఉండాలనే షరతుకి లోబడి ఆర్టికల్ 142 కింద ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసినట్లు స్పష్టం చేసింది. కేసులు కొట్టేయడంతో సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను రద్దు చేస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. సెప్టెంబర్ 5న చేపట్టాల్సిన నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు సీజేపీ ప్రతినిధులు తెలిపారు.

# జీడీపీ జోరు.. మోదీ హర్షం!

**మొదటి పేజీ తరువాయి**

ప్రజల్లో నిరుత్సాహాన్ని వ్యాప్తి 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంస్తున్నారని ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఇలాంటి అడ్డంకులను అధిగమిస్తూ భారత్ 7.8% వృద్ధిని సాధించిందని అన్నారు. ఇదే వేగాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**'వోకల్ ఫర్ లోకల్'కు ప్రాధాన్యం..**

దేశీయ ఉత్పత్తులు, స్థానిక వినియోగానికి ప్రజలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని మోదీ సూచించారు. 'స్వదేశీ', 'వోకల్ ఫర్ లోకల్' స్ఫూర్తిని ప్రజలు పాటించాలని అన్నారు. విదేశాలకు విహారయాత్రలకు వెళ్లాల్సిన అవసరం లేకపోతే వెళ్లవద్దని, వివాహాలను కూడా విదేశాల్లో కాకుండా భారత్‌లోనే నిర్వహించేలా 'వెడ్ ఇన్ ఇండియా'కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అవసరం లేనప్పుడు బంగారం కొనుగోలు చేయడాన్ని కూడా తగ్గించాలని అన్నారు.


స్వదేశీ, ఆత్మనిర్భరతకు ఎంత ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే అంత బలమైన భారత్‌ను నిర్మించగలమని ప్రధాని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే సమయానికి యువతకు అభివృద్ధి చెందిన భారత్‌ను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**రూ.81.36 లక్షల కోట్లకు వాస్తవ జీడీపీ..**

కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వాస్తవ జీడీపీ రూ.81.36 లక్షల కోట్లుగా నమోదైంది. 2025-26 ఇదే త్రైమాసికంలో ఇది రూ.75.46 లక్షల కోట్లుగా ఉంది. దీంతో ఏడాది ప్రాతిపదికన 7.8% వృద్ధి నమోదైంది. ఈ వృద్ధి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గతంలో అంచనా వేసిన 7% కంటే ఎక్కువగా ఉండటం విశేషం. పూర్తి 2026-27 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ వృద్ధి అంచనాను ఆర్‌బీఐ 6.6% నుంచి 6.7%కి సవరించింది.

ప్రస్తుత ధరల ఆధారంగా లెక్కించే నామమాత్ర జీడీపీ 2026-27 తొలి త్రైమాసికంలో రూ.88.27 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది రూ.80 లక్షల కోట్లుగా ఉండగా.. ఈసారి 10.3 శాతం వృద్ధి నమోదైంది. అదే సమయంలో వాస్తవ స్థూల విలువ జోడింపు (జీవీఏ) రూ.73.82 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాది తొలి త్రైమాసికంలో రూ.68.21 లక్షల కోట్లుగా ఉన్న వాస్తవ జీవీఏ ఈసారి 8.2 శాతం వృద్ధి చెందింది.

# ఏపీలో లవ్ జిహాద్



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబరు (బీఎన్ఎస్ న్యూస్):** ఏపీలో మరో లవ్ జిహాద్ ఘటన కలకలం రేపుతోంది. కాకినాడ జిల్లా జగన్నాథపురానికి గౌస్ మొహినుద్దీన్ అనే వ్యక్తి తనను ప్రేమించి పెళ్లి చేసుకుని మతం మార్చి మోసం చేశాడంటూ శిరిపూరి బాలరమ్య (మతం మారిన తరవాత షేక్ ఉమల్ ఖైర్) పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా గౌస్‌పై బాలరమ్య సంచలన ఆరోపణలు చేసింది. తనను 2019లో గౌస్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని, తరవాత మతం మార్చి వేధిస్తున్నాడని చెప్పింది. తాను డిగ్రీ చదువుతున్న సమయంలో స్థానికంగా మటన్ దుకాణం నిర్వహించే గౌస్ మొహినుద్దీన్‌తో పరిచయం ఏర్పడిందని చెప్పింది. అది కాస్తా ప్రేమగా మారడంతో కుటుంబ సభ్యులను ఎదిరించి అతడిని వివాహం చేసుకున్నట్టు తెలిపింది.

పెళ్లి తరవాత రెండు నెలలకే వేధింపులు మొదలయ్యాయని, తన ఇష్టానికి వ్యతిరేకంగా మతం మార్పించి పేరును కూడా మార్చాడని చెప్పింది. తనను మోసం చేసినట్టే మరో ఐదుగురు హిందూ మహిళలను కూడా ఉచ్చులోకి దింపి ఒకరికి తెలియకుండా మరొకరితో సహజీవనం చేస్తున్నాడని ఆరోపించింది. మొహినుద్దీన్ ట్రాప్ చేసిన మహిళలంతా హిందువులేనని చెప్పింది. ప్రస్తుతం ఓ మహిళ చేసిన ఫిర్యాదుతో మొహినుద్దీన్ రిమాండ్‌లో ఉన్నాడని ఇదే అదునుగా భావించి అతడి నుండి తప్పించుకుని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చానని తెలిపింది. ప్రతి అమ్మాయికి మతం మార్చనని చెప్పి తరవాత వేధింపులకు గురిచేస్తాడని ఆరోపించింది. బాలరమ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్



# అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో విస్తరిస్తున్న వృత్తి అవకాశాలను యువ న్యాయ నిపుణులు అందిపుచ్చుకోవాలి

విశాఖపట్నం, ఆగస్టు 31: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ న్యాయ మరియు అనుబంధ విభాగాల కేంద్రం (జ×రూాణ) ఆధ్వర్యంలో "సరిహద్దులకు ఆవల 2.0: అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో వృత్తులు మరియు ధోరణులు" అనే అంశంపై సోమవారం ఒక రోజు అంతర్జాతీయ కార్యశాల నిర్వహించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డా.) డి. సూర్య ప్రకాష్ రావు స్వాగతోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది.

గోవాలోని అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ (డా.) ఆర్. వెంకట రావు ముఖ్య అతిథిగా, భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి (చట్టపరమైన మరియు ఒప్పందాలు) డా. వై. ఉమా శంకర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ న్యాయశాస్త్రం ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని ప్రొఫెసర్ వెంకట రావు పేర్కొన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ న్యాయ సూత్రాలపై విస్తృత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.



డా. ఉమా శంకర్ అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో వృత్తి అవకాశాలు, దేశీయ--అంతర్జాతీయ చట్టాల అనుసంధానం, నేరస్థుల అప్పగింత, దౌత్య సంబంధాలు తదితర అంశాలను వివరించారు. అనంతరం అతిథులను వైస్ ఛాన్సలర్ సత్కరించారు. ఈ సందర్భంగా "అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో వృత్తికి మార్గదర్శి--సంపుటి 2"ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఇన్‌చార్జ్ డా. విశ్వచంద్ర నాథ్ మదాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కడపలో 70 వ "ఎల్ఐసి" బీమా వారోత్సవాల పండుగ.!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 01:




కడపలో ఎల్ఐసి 70 వ బీమా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి భారతీయ కుటుంబానికి ఎల్ఐసి నమ్మకమైన నేస్తమని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి కొనియాడారు. ప్రతి భారతీయ కుటుంబానికి ఎల్ఐసి నమ్మకమైన నేస్తమని, ఆపత్కాలంలో అండగా నిలిచే నిజమైన ఆపద్బంధువని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ జి. రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభమైన 70 వ బీమా వారోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలకు ఇన్సూరెన్స్ అనగానే గుర్తొచ్చే మొదటి పేరు ఎల్ఐసి అని, గత ఏడు దశాబ్దాలుగా భారత సమాజం, దేశ ఆర్థిక వ్యవస్థపై సంస్థ చెరగని ముద్ర వేసిందని కొనియాడారు. సంస్థ అభివృద్ధిలో సిబ్బంది, ఏజెంట్ల పాత్ర కీలకమని ప్రశంసిస్తూ, 'బీమా సఖీ' కార్యక్రమం ద్వారా మహిళలను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ?సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్‌డీఎం ఎం.వి.కె.ఎస్. దుర్గాప్రసాద్ ఎల్ఐసి పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ.. కేవలం రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసి నేడు రూ.57.29 లక్షల కోట్ల ఆస్తులతో దేశ నిర్మాణంలో, క్లెయిమ్స్ చెల్లింపుల్లో అగ్రగామిగా నిలిచిందని వివరించారు. కడప డివిజన్ అన్ని వ్యాపార విభాగాల్లో గతేడాది కంటే అత్యుత్తమ పురోగతి సాధించిందని, పాలసీదారులు త్వరితగతిన సేవలందు కోవడానికి మై ఎల్ఐసి యాప్ ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు బి. వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ శర్మ, కె.వి. వసంత గౌరి, ఫయాజ్ అహ్మద్, వెంకట కృష్ణలతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 70 వ ఎల్ఐసి బీమా వారోత్సవాలు పురస్కరించుకొని కడప జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల నందు పెద్ద ఎత్తున వారోత్సవ కార్యక్రమాలను ఆయా శాఖల బ్రాంచ్ మేనేజర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

# ముమ్మిడివరం ఇంచార్జీ లేమితో జనసేన డి ఛార్జ్

## జనసేన మనుగడకు నీలి నీడలు



ముమ్మిడివరం (బీఎన్ఎస్) సెప్టెంబర్ :1 ముమ్మిడివరం నియోజకవర్గం లో జనసేన పార్టీ రాజకీయ మనుగడపై ప్రస్తుతం ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. నియోజకవర్గ స్థాయిలో స్పష్టమైన, బలమైన నాయకత్వం కనిపించకపోవడం, పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసే నాయకత్వ లోపం వంటి అంశాలు జనసేన శ్రేణుల్లోనే చర్చనీయాంశంగా మారుతున్నాయి.

పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలపై కనీస అవగాహన లేని వ్యక్తులకు ప్రాధాన్యత పెరుగుతోందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు కొంతమంది జనసేన నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తూ, రాజకీయంగా కూడా టీడీపీపై ఆధారపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు జనసేన స్వతంత్ర రాజకీయ ఉనికిపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

పార్టీకి చెందిన నాయకులే తమ కార్యక్రమాలను నిర్వహించుకునే పరిస్థితి లేకుండా, ఇతర పార్టీ నాయకులు ముందుకు వచ్చి కార్యక్రమాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడితే అది జనసేన సంస్థాగత బలంపై సహజంగానే చర్చకు దారితీస్తుంది. ఒక పార్టీ నాయకుడి జన్మదిన వేడుకలను కూడా టీడీపీకి చెందిన నాయకులు నిర్వహించడం వంటి పరిణామాలు కూటమి రాజకీయాల్లో స్నేహపూర్వక సమన్వయంగా కనిపించవచ్చు. అయితే, అదే సమయంలో జనసేనకు స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహించే సామర్థ్యం ఎంతమేరకు ఉందనే ప్రశ్న కూడా తలెత్తుతోంది.

ఇక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు జనసేనకు అసలు పరీక్షగా మారనున్నాయి. గ్రామస్థాయిలో బలమైన కమిటీలు, చురుకైన కార్యకర్తలు, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లను నియమించగల సామర్థ్యం, స్థానిక సమస్యలపై ప్రజలతో నిరంతర సంబంధం---ఇవన్నీ ఒక రాజకీయ పార్టీ బలాన్ని నిర్ధారించే అంశాలు. ఇవి బలహీనంగా ఉంటే ఎన్నికల సమయంలో ఇతర మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది.

మరోవైపు జనసేన రాష్ట్ర స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. కాబట్టి ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ముమ్మిడివరం వంటి నియోజకవర్గాల్లో సంస్థాగత పరిస్థితిని సమీక్షించి, సమర్థమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒక రాజకీయ పార్టీకి మిత్రపక్షం అవసరం కావచ్చు. కానీ మిత్రపక్షం సహకారం లేకుండా స్వయంగా నిలబడలేని స్థితి ఏర్పడితే అది రాజకీయంగా ఆ పార్టీకి హెచ్చరికే. ముమ్మిడివరంలో జనసేనకు ఇప్పుడు ఎదురవుతున్న ప్రధాన సవాలు ఇదేనని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ తన స్వతంత్ర సంస్థాగత బలాన్ని ఎంతవరకు నిరూపించుకుంటుందో వేచి చూడాల్సిందే

# మంత్రి లోకేష్ ఆదేశాలతో గోటేటి రామూర్తి కుటుంబానికి రెండో పెన్షన్..

## రూ.15 వేల పెన్షన్ అందజేత.. వస్త్రాలు, పండ్లు అందించిన ఎమ్మెల్యే సతీమణి కమలారాణి...

కొత్తపేట(బీఎన్ఎస్) సెప్టెంబర్ :1 పేద కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సతీమణి బండారు కమలారాణి అన్నారు. కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి గ్రామానికి చెందిన గోటేటి రామూర్తి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని సోషల్ మీడియాలో వచ్చిన సమాచారంపై మంత్రి నారా లోకేష్ స్పందించి, ఆ కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు.

మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనలతో రామూర్తి కుటుంబానికి ఇప్పటికే 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్ అందించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు కమలారాణి తెలిపారు.

ఇందులో భాగంగా రామూర్తి కుటుంబానికి రెండో పెన్షన్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు, తాజాగా రామూర్తి తల్లికి నెలకు రూ.15 వేల పెన్షన్‌ను కమలారాణి, డీఆర్డీఏ పీడీ, ఆర్డీఓల చేతుల మీదుగా అందజేశారు. మంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం సంతోషంగా ఉందన్నారు.

అదేవిధంగా రామూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించిన కమలారాణి వారికి వస్త్రాలు, పండ్లు అందజేసి ఆప్యాయతను చాటుకున్నారు. కుటుంబానికి ప్రభుత్వం, ఎమ్మెల్యే తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



రామూర్తి కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇచ్చిన హామీ మేరకు ఇంటి నిర్మాణ పనులు చేపట్టినట్లు కమలారాణి తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఆ కుటుంబానికి అందజేస్తామని చెప్పారు.

సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహాయాన్ని అర్హులైన పేద కుటుంబాలకు చేరవేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కమలారాణి అన్నారు. ప్రజల సమస్యలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని, వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న మంత్రి నారా లోకేష్‌కు కొత్తపేట నియోజకవర్గ ప్రజల తరఫున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కష్టాల్లో ఉన్న ఒక కుటుంబానికి విద్యుత్ సౌకర్యం, పెన్షన్, ఇల్లు వంటి సహాయాలను అందిస్తూ అండగా నిలవడం కూటమి ప్రభుత్వం ప్రజా పాలనకు నిదర్శనమని కమలారాణి పేర్కొన్నారు.

# రూ.3.11 లక్షల పెన్షన్ సొమ్ములతో పరారైన ఇంజనీరింగ్ అసిస్టెంట్

బండారు లంక (బీఎన్ఎస్)సెప్టెంబర్ :1 బండారులంక సచివాలయం 1లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న కరిబండి శివశంకర్ 75 మందికి పంచాల్సిన రూ.3.11 లక్షల నగదుతో పరారయ్యాడు.




మంగళవారం ఉదయం నుంచి ఒక్కరికి కూడా పెన్షన్ పంపిణీ చేయకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. మధ్యాహ్నం 12 గంటలు అయినా పెన్షన్ పంపిణీకి రాకపోవడంతో లబ్ధిదారులు బండారులంక పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ డీవీఎల్ అన్నపూర్ణ,డిప్యూటీ ఎంపీడీవో గరిమెళ్ళ రవిలు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ కు ఉదయం నుంచి ఎన్నిసార్లు ఎవరు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదు.దాంతో అధికారులు ఫిర్యాదులు స్వీకరించే పనిలో పడ్డారు. ఇంతకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ ఎందుకు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు..ఏదైనా జరిగిందా.. అనారోగ్యంతో బాధపడుతున్నాడా అని పలు కోణాల్లో ఆలోచిస్తున్నారు.గత కొంతకాలంగా శివ ఫ్రెంచ్ యానంలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు.ఇప్పటివరకు అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి గ్రామంలో నివాసం ఉండేవాడు.కానీ ఇంతవరకు పంచాయతీ అధికారులు ఈదరపల్లిలోని శివ ఇంటికి ఎందుకు వెళ్ళలేదు అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి...

# ఐక్యతే బలం.. పవన్ ఆశయ సాధనే మనందరి లక్ష్యం...!!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 01:

నేడు రాజంపేటలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి. రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు.




జనసేన పార్టీ అధినేత, రాష్ట ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2 న నేడు రాజంపేటలో నిర్వహించనున్న జన్మదిన వేడుకలను జనసైనికులు, కార్యకర్తలు, వీర మహిళలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం యల్లటూరు భవన్ లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించనున్న ర్యాలీలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని, అలాగే పవన్ కళ్యాణ్ అదే రోజున పార్టీ యువజన విభాగాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆయన ప్రసంగాన్ని వీక్షించేందుకు ఏర్పాటు చేసిన భారీ తెర ప్రదర్శన కార్యక్రమానికి జనసేన శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేలా జనసేన శ్రేణులు సమష్టిగా కార్యాచరణ రూపొందించుకోవాలని యల్లటూరు సూచించారు. రాష్ట్ర రాజకీయాల్లోకి యువత మరింతగా రావాలన్న పవన్ కళ్యాణ్ సంకల్పానికి అనుగుణంగా, ఆయన జన్మదినం సందర్భంగా యువతకు ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి జనసైనికుడు స్వాగతించాలని అన్నారు. జనసేన పార్టీ కుటుంబ సభ్యులంతా ఐక్యంగా పాల్గొని నేడు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని, పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని యల్లటూరు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు.

# జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ విప్.!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 01: జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వ విప్, బిజెపి శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కడపజిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్ రెడ్డి కూడా కలిసారు. వారు ఆసుపత్రిలోని



వివిధ విభాగాలను సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి బాధిత పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలోని వివిధ బ్లాక్ ల నందు సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, పార్టీ నేతలు మరియు ఆసుపత్రి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, వసతుల కొరతల గురించి వైద్యుల ద్వారా వివరాలు తీసుకున్నారు.తద్వారా స్థానిక ఆరోగ్య వ్యవస్థ మెరుగుపరచడానికి అవసరమైన చర్యలపై ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. అలాగే ఈ సమావేశంలో జరిగిన చర్చలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, మరియు ఆసుపత్రి వైద్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ విప్.!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 01: జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వ విప్, బిజెపి శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కడపజిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్ రెడ్డి కూడా



కలిసారు. వారు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి బాధిత పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలోని వివిధ బ్లాక్ ల నందు సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, పార్టీ నేతలు మరియు ఆసుపత్రి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, వసతుల కొరతల గురించి వైద్యుల ద్వారా వివరాలు తీసుకున్నారు.తద్వారా స్థానిక ఆరోగ్య వ్యవస్థ మెరుగుపరచడానికి అవసరమైన చర్యలపై ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. అలాగే ఈ సమావేశంలో జరిగిన చర్చలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, మరియు ఆసుపత్రి వైద్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు నేరం

## అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

ఆంధ్రప్రదేశ్ :మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిషేధం, బాలికల భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్య వివాహాలకు, మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై బాల్య వివాహ రద్దు చట్టం మరియు పోక్సో చట్టాల కింద కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఆపద సమయంలో బాలికలు 1098, 181, 112 నెంబర్లకు డయల్ చేయాలని, రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో 'శక్తి యాప్' డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీమతి హైమావతి, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, సీఐ మహమ్మద్ రఫీ, ఎస్బీ సీఐ యు. సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్

## రౌద్రరూపంలో రష్మిక




నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ సినిమా 'మైసా'. రవీంద్ర పుల్లె ఈ చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం అవుతుండటం విశేషం. అన్ ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై అజయ్ సాయిపురెడ్డి, అనిల్ సయ్యపురెడ్డి, వీరసాయి గోప ఈ సినిమాను నిర్మిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఈ కథలో రష్మిక ఒక ధైర్యవంతురాలైన గిరిజన మహిళగా కనిపించనున్నారు. తమ అడవిని, గోండు తెగ ప్రజలను ఆక్రమణదారుల నుంచి కాపాడుకోవడానికి ఆమె చేసిన పోరాటమే ఈ సినిమా ముఖ్య కథాంశం. ఇక షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న సమయంలోనే యాక్షన్ సీన్స్‌లో భాగంగా ఇటీవల.. రష్మికకు చిన్న గాయం కావడంతో చిత్రీకరణకు కాస్త బ్రేక్ పడింది. అయితే తాను కోలుకున్నానని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటానని రష్మిక స్పష్టం చేయడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇక షూటింగ్ ఆగినప్పటికీ.. తాజాగా, చిత్ర బృందం ప్రేక్షకులకు ఓ బిగ్ సర్ ప్రైజ్ ఇచ్చింది. సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ ఒక పవర్ ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. 2026 నవంబర్ 27న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ పోస్టర్‌లో రష్మిక పవర్ ఫుల్ లుక్‌లో ఆకట్టుకునేలా ఉంది. చీరకట్టులో ఉన్న నేషనల్ క్రష్ ఒక చేతికి విరిగిన సంకెళ్లు, మరో చేతిలో ఈటె పట్టుకుని యుద్ధభూమిలో నిలబడిన తీరు ప్రేక్షకులలో గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఒంటిపై గాయాలు ఉన్నప్పటికీ, ఆమె కళ్లలో కనిపిస్తున్న రౌద్రం సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ప్రస్తుతం రష్మిక పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

## సర్దార్ ఆన్ యాక్షన్




వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకులను మెప్పించే హీరో కార్తీ, దర్శకుడు పి.ఎస్. మిత్రన్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ స్పై థ్రిల్లర్ 'సర్దార్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ చిత్రానికి సీక్వెల్‌గా 'సర్దార్ 2' రూపుదిద్దుకుంటోంది. మరో పది రోజుల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా ట్రైలర్ ను తాజాగా రిలీజ్ చేశారు. దేశం పెను ప్రమాదంలో ఉన్నప్పుడు ఒక రహస్య బ్లాక్ ఆప్స్ మిషన్‌ను పూర్తి చేయడానికి జపనీస్ భాషలో ప్రావీణ్యం ఉన్న నైపుణ్యంగల ఏజెంట్ రంగంలోకి దిగే నేపథ్యంతో కథ సాగుతుంది. పల్లెటూరి సంస్కృతి, డ్రామా నేపథ్యం ఉన్న యువకుడిగా మరియు దేశాన్ని కాపాడే నిగూఢమైన గూఢచారి 'సర్దార్' పాత్రలో కార్తీ కనిపిస్తారు.

కార్తీతో తలపడే ప్రతినాయకుడి పాత్రలో ఎస్.జె. సూర్య తనదైన శైలిలో వైవిధ్యమైన, క్రూరమైన నటనతో ఆకట్టుకోనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఎయిర్‌క్రాఫ్ట్ ఛేజింగ్‌లు, గన్ ఫైట్స్ మరియు ఉత్కంఠభరితమైన స్టంట్ సీక్వెన్స్‌లు ఈ చిత్రానికి హైలైట్‌గా నిలవనున్నాయి. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో 10 సెప్టెంబర్ 2026న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సాంకేతిక విలువలు, భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఆద్యంతం అలరించేందుకు సిద్ధమవుతోంది.

## 'మార్కో' డైరెక్టర్‌తో ప్రభాస్?



ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఏ దర్శకుడితో సినిమా ప్రకటిస్తారో అని అభిమానులు ఎప్పుడూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', మరియు 'కల్కి 2' వంటి భారీ సినిమాలతో పూర్తి బిజీగా ఉన్నారు. ఈ ప్రాజెక్ట్‌లు పూర్తయిన వెంటనే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సలార్ 2' సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ బిజీ షెడ్యూల్ వల్ల ఇప్పట్లో ప్రభాస్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావడం కష్టమే అని అందరూ భావించినప్పటికీ అక్టోబర్ 23న ఆయన పుట్టినరోజు సందర్భంగా ఓ సర్‌ప్రైజింగ్ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

మలయాళంలో హింసాత్మక ఆక్షన్ డ్రామాగా సరికొత్త రికార్డులు సృష్టించిన 'మార్కో' ఫేమ్ దర్శకుడు హనీఫ్ అదేనితో ప్రభాస్ సినిమా చేయబోతున్నారనే వార్త ఫిలింనగర్ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది. రా అండ్ రస్టిక్ యాక్షన్ సినిమాలకు పేరుగాంచిన హనీఫ్ వినిపించిన ఒక పవర్‌ఫుల్ లైన్‌కు ప్రభాస్ కూడా పాజిటివ్‌గా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌ను స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు సెట్ చేసే పనిలో ఉన్నారట. ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా అంతర్జాతీయ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు దిల్ రాజు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ బిగ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి చాలా సమయం పట్టేలా ఉంది. ప్రస్తుతం ప్రభాస్ లైనప్ చూస్తుంటే, అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ సినిమా 2028లో ప్రారంభమై 2029లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ ఊహాగానాల్లో ఎంతవరకు నిజముందో వేచి చూడాల్సిందే.

## 'మారెమ్మ' ట్రైలర్ రిలీజ్..




మాస్ మహారాజ రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు ప్రధాన పాత్రలో తెరకెక్కిన విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ' ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన టీజర్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. ఇప్పుడు ట్రైలర్ ద్వారా కథకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్రామీణ నేపథ్యం, దైవ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, యాక్షన్ అంశాలను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ విషయానికి వస్తే.. ఓ సంక్షోభంలో చిక్కుకున్న గ్రామస్తులు తమ గ్రామ దేవత మరెమ్మ తల్లిపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే అమ్మవారికి సంబంధించిన పవిత్రమైన ఎద్దు అనూహ్యంగా కనిపించకుండా పోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు మొదలవుతాయి. ఆ ఎద్దు అదృశ్యం కావడం వెనుక ఏదో పెద్ద కారణం ఉందని గ్రామస్తులు భావిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో యువ కథానాయకుడిపై ఆ ఎద్దును వెతికి తీసుకురావాల్సిన బాధ్యత పడుతుంది.

ఎద్దు కోసం అతడు చేసే అన్వేషణ క్రమంలో ఎన్నో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గ్రామంలో పాతుకుపోయిన నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు అతడి ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈ క్రమంలో హీరో పలు హింసాత్మక సంఘర్షణల్లో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అయితే 'మారెమ్మమ్మ' కథలో అసలు మిస్టరీ ఏమిటన్నది మాత్రం ట్రైలర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. పవిత్రమైన ఎద్దు ఎందుకు కనిపించకుండా పోయింది? దాని వెనుక ఎవరి హస్తం ఉంది? హీరో ఎదుర్కొనే సమస్యలకు, గ్రామ దేవత నమ్మకాలకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను అలాగే ఉంచుతూ ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు.

ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చింది. సాధారణ విలేజ్ డ్రామాకు భిన్నంగా దైవ విశ్వాసం, గ్రామీణ ఆచారాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను కలిపి కథను నడిపించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో దీపా బాలు కథానాయికగా నటించగా.. వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపలక్ష్మి, దయానంద్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ట్రైలర్‌తో సినిమాపై మరింత ఆసక్తిని పెంచిన 'మారెమ్మ' సెప్టెంబర్ 10, 2026న థియేటర్లలోకి రానుంది. గ్రామీణ నేపథ్యంలోని మిస్టరీ, యాక్షన్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.

## 'టాక్సిక్'కు బిగ్ షాక్!




మాస్ హీరోల భారీ బడ్జెట్ సినిమాలకు సాధారణంగా సొంత రాష్ట్రంలో ఆరంభంలోనే భారీ వసూళ్లు రావడం సాధారణం. టాక్ ఎలా ఉన్నప్పటికీ బిగ్ బడ్జెట్, విపరీతమైన క్రేజ్ ఉన్న చిత్రాలు అడ్వాన్స్ బుకింగ్స్, భారీ ఓపెనింగ్స్‌తో ఈజీగా రికార్డు వసూళ్లను సాధిస్తుంటాయి. అయితే రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'టాక్సిక్' చిత్రానికి కర్ణాటకలో దానికి భిన్నమైన పరిస్థితులు ఎదురవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

సొంత హోమ్ స్టేట్ అయిన కర్ణాటకలో ఈ చిత్రం కనీసం రూ. 100 కోట్ల గ్రాస్ క్లబ్‌లో కూడా చేరలేకపోవడం ట్రేడ్ వర్గాలను షాక్‌కు గురిచేసింది. యష్‌కున్న క్రేజ్‌ను బట్టి కర్ణాటక బాక్సాఫీస్ వద్ద ఈ మార్క్‌ను చాలా తేలికగా చేరుకుంటుందని అందరూ భావించారు. మొదటి రోజు భారీ వసూళ్లు రాబట్టిన టాక్సిక్ రెండవ రోజు నుండి ఒక్కసారిగా డ్రాప్ అయింది. అనుకున్న స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్ లేకపోవడంతో థియేట్రికల్ రన్‌లో వంద కోట్ల మార్జిన్‌ను అందుకోవడంలో విఫలమైంది. అయితే కన్నడ మాతృభూమిలో ఆశించిన స్థాయి వసూళ్లు రానప్పటికీ, ఉత్తరాదిలో హిందీ బెల్ట్ లో మాత్రం 'టాక్సిక్' మెరుగైన ప్రదర్శన కనబరిచింది. కన్నడ వెర్షన్‌తో పోలిస్తే హిందీ మార్కెట్‌లో ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కడం విశేషం. బాలీవుడ్ బెల్ట్‌లో వస్తున్న వసూళ్లు సినిమాకు కొంత ఊరటనిస్తున్నాయి. తెలుగులోను ఈ సినిమా మొదటి రోజు సాలిడ్ ఓపెనింగ్ తెచుకున్నప్పటికీ రెండవ రోజు నుండి షోస్ క్యాన్సిల్ అయ్యే పరిస్థితి చూసింది. దాంతో తెలుగులోను ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచి బయ్యర్స్ కి నష్టాలు తెచ్చింది.